# రాజన్న తలనీలాల బకాయిలు వసూలయ్యేనా ?

- రెండేండ్ల కాలానికిగాను రూ.19కోట్లకు ఒప్పందం
- ఏడాదిపాటు చెల్లించి చేతులెత్తేస్తున్న కాంట్రాక్టర్
- ఐదు నెలలుగా పెండింగ్.. రూ.4కోట్ల బకాయిలు
- ఆలయ అధికారుల ఆధీనంలోనే తలనీలాలు
- బకాయిలు చెల్లించలేనని దేవాదాయశాఖ కమిషనర్‌కు కాంట్రాక్టర్ వినతి
- డబ్బులు చెల్లించకపోతే కోర్టుకు వెళ్తామని అధికారుల స్పష్టం


రాజన్న ఆలయంలోని కళ్యాణకట్టలో తలనీలాలు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

**వేములవాడ రాజన్న ఆలయంలో తలనీలాల బకాయిలు పేరుకుపోతున్నాయి. 2023-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.19కోట్లకు టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్, ఏడాది పాటు చెల్లించి చేతులెత్తేయగా, ఐదు నెలలుగా రూ.4కోట్లు పెండింగ్‌లో పడ్డాయి. అయితే అంతర్జాతీయంగా డిమాండ్ లేకపోవడంతో నష్టం వాటిల్లుతున్నదని, బకాయిలు చెల్లించలేనని, ఇన్నాళ్లూ అధికారుల ఆధీనంలో ఉంచుకున్న తలనీలాలు ఇవ్వాలని దేవాదాయశాఖ కమిషనర్‌కు కాంట్రాక్టర్ వినతి పత్రం అందజేయడం చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉంటే బకాయిలు చెల్లించకపోతే ఊరుకునేది లేదని, నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్‌పై కోర్టుకు వెళ్తామని ఆలయ యంత్రాంగం చెబుతుండగా, ఏం జరుగుతుందో వేచి చూడాల్సి ఉన్నది.**

వేములవాడ, సెప్టెంబర్ 18: దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ రాజన్న ఆలయం భక్తుల కొంగుబంగారంగా నిలుస్తున్నది. ఇక్కడికి రాష్ట్రంతోపాటు దేశ నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. తలనీలాలు సమర్పిస్తే కోరిన కోర్కెలు తీరుతాయనే నమ్మకంతో తిరుమల తిరుపతి తర్వాత భక్తులు అత్యధికంగా ఇక్కడే తలనీలాలు ఇస్తుంటారు. ఏటా సుమారు 5 నుంచి 7లక్షల మంది తలనీలాలు సమర్పిస్తుంటారు. ప్రతి నెలా ఆలయానికి వచ్చే ఆదాయంలో సింహభాగం ఈ తలనీలాల ద్వారానే వస్తుండగా, టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఐదు నెలలుగా బకాయిలు చెల్లించడం లేదు.

**రూ.19కోట్లకు ఒప్పందం.. ఐదు నెలలుగా బకాయి**

2023-25 ఆర్థిక సంవత్సరాలకుగాను రాజన్న ఆలయంలో తలనీలాలను పోగు చేసుకునే హక్కును సుమిత్ ఎంటర్‌ప్రైజెస్, ఆంధ్రప్రదేశ్‌లోని హిందూపురానికి చెందిన కాంట్రాక్టర్ నాగరాజు దక్కించుకున్నాడు. రూ.50 లక్షల డిపాజిట్ చేసి, ప్రతి నెలా రూ.79,17,000 చెల్లించేందుకు 24 చెక్కులను ఆలయ అధికారులకు అందజేశాడు. ఏప్రిల్ 2024 వరకు రూ.8కోట్ల 92లక్షల 4500 చెక్కుల ద్వారా చెల్లించాడు. ఆ తర్వాతి నెల నుంచి చెల్లించకపోవడంతో చెక్కులు బౌన్స్ అవుతున్నాయని, సదరు కాంట్రాక్టర్ సెప్టెంబర్ వరకు రూ.3కోట్ల 95లక్షల 85వేలు బాకీపడ్డాడని అధికారులు చెబుతున్నారు. దీంతో అప్పటి నుంచి కాంట్రాక్టర్‌కు తలనీలాల సరఫరాను అధికారులు నిలిపివేశారు. దాదాపు 55 గన్నీ సంచుల్లో మేర తలనీలాలను తమ ఆధీనంలోనే ఉంచుకుంటున్నారు. చెక్ బౌన్స్ అయినందున న్యాయవాది ద్వారా కాంట్రాక్టర్‌కు నోటీసు కూడా పంపించారు. ఈ క్రమంలో సదరు కాంట్రాక్టర్ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్‌ను కలిసి అంతర్జాతీయంగా ధరలేనందున నష్టం వాటిల్లుతోందని, ఇప్పటివరకు సేకరించిన తలనీలాలు ఇవ్వాలని వినతి పత్రం అందజేసి కోరినట్లు తెలిసింది. సదరు కాంట్రాక్టర్ వినతిని దేవాదాయశాఖ అధికారి రాజన్న ఆలయ అధికారులకు పంపగా, ఇప్పటికే రెండు చెక్కులు బౌన్స్ అయ్యాయని, వాటిపై కోర్టుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నామని సమాధానం ఇచ్చినట్లు తెలుస్తున్నది. మార్కెట్ రేటుకు వేలంకు సంబంధం లేదనే అంశాన్ని వివరిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్‌కు లేఖ పంపినట్లు తెలిసింది.


తలనీలాలను భద్రపరిచి సీల్ వేసిన అధికారులు

### బకాయిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం



రాజన్న ఆలయంలో తలనీలాల టెండర్ దక్కించుకున్న సుమిత్ ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులు స్వామివారికి సకాలంలో డబ్బులు చెల్లించడం లేదు. ఇప్పటికే వారు ఇచ్చిన చెక్కులు బౌన్స్ అయ్యాయి. లీగల్ నోటీసులు కూడా జారీ చేశాం. నిబంధనల ప్రకారం డబ్బులు చెల్లించకుండా మొండికేస్తున్న కాంట్రాక్టర్ పై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం. కేసులు నమోదు చేసి స్వామివారికి రావాల్సిన ప్రతి పైసాను వసూలు చేస్తాం.

**- వినోద్ రెడ్డి, రాజన్న ఆలయ ఈవో**
**వేములవాడ**

# వేములవాడతో 'కోటా'కు విడదీయని బంధం

- 45ఏండ్లపాటు రాజన్న ఆలయంలో హరికథలు చెప్పిన సచ్చిదానంద శాస్త్రి
- ఆయన మృతితో హరికథా ప్రియుల దిగ్భ్రాంతి


సచ్చిదానందశాస్త్రి (ఫైల్)

వేములవాడ, సెప్టెంబర్ 18: పద్మశ్రీ కోటా సచ్చిదానందశాస్త్రి మరణంతో పట్టణంతోపాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో హరికథ ప్రియులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కోటాకు వేములవాడతో విడదీయని బంధం ఉన్నది. రాజన్న ఆలయంలో ఆయన దాదాపు 45సంవత్సరాల పాటు 60కి పైగా హరికథలు వినిపించారు. హరికథ చక్రవర్తిగా పేరుగాంచిన కోటా ఆంధ్ర ప్రదేశ్‌లోని అద్దంకి ప్రాంతానికి చెందిన కోటా సచ్చిదానంద శాస్త్రి గుంటూరులో స్థిరపడ్డారు. వేములవాడ రాజన్న ఆలయంలో శరన్నవరాత్రులు, త్యాగరాజ ఆరాధన ఉత్సవాలకు కోట హరికథకు ప్రత్యేక ప్రాధాన్యత ఉండేది. వృద్ధాప్యంతో ఆయన 2017లో త్యాగరాజ ఆరాధనోత్సవాలకు చివరిసారిగా హాజరయ్యారు. ఆయన హరికథకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు హైదరాబాద్ నుంచి కూడా తరలివచ్చేవారు. సుదీర్ఘంగా 9 నుంచి 12గంటల పాటు హరికథా వినిపించేవారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న హరికథప్రియులు బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు మధు రాధాకిషన్, పురాణం రాము, వాసాలమర్రి గోపి, రాజన్న ఆలయ రిటైర్డ్ ఉద్యోగి రామయ్యశాస్త్రి, మధు శ్రీనివాసశర్మ, లోకే మనోహర్‌శర్మ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# నిమజ్జనంలో అపశ్రుతి

- ట్రాక్టర్ కింద పడి యువకుడి మృతి
- దుమాలలో విషాదం


న్యాలకంటి రాకేశ్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 18 : వినాయక నిమజ్జనం కోసం తోటి స్నేహితులతో కలిసి నిమజ్జన ఏర్పాట్లను చూసి కలివిడిగా ఉన్న యువకుడి పైనుంచి ట్రాక్టర్ వెళ్లగా మృతి చెందిన ఘటన బుధవారం దుమాలలో విషాధాన్ని నింపింది. వివరాల్లోకి వెళ్తే.. దుమాలకు చెందిన న్యాలకంటి రఘుపతి-మాధవి దంపతుల ఒక్కగానొక్క కుమారుడు రాకేశ్(17) ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. గురువారం సాయంత్రం గ్రామంలోని తమ యువకులతో కలిసి వినాయకుడి విగ్రహ నిమజ్జనం కోసం ఏర్పాట్లు చేస్తున్నాడు. ఈ క్రమంలో వినాయకుడిని ట్రాక్టర్‌పై ఉంచి డీజిల్ పోసి మధ్యలోని పెద్ద టైరు ముందు నిలుచొని ట్రాక్టర్‌ను స్టార్ట్ చేశాడు. అప్పటికే గేర్‌లో ఉన్న ట్రాక్టర్ ముందుకు కదిలింది. దీంతో రాకేశ్ పెద్ద టైరు కింద పడిపోగా, చాతి భాగం నుంచి ఇంజిన్ వెళ్లింది. అక్కడున్న వ్యక్తులు ఇంజిన్ ఆఫ్ చేసి రాకేశ్‌ను మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్న క్రమంలో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు, బంధువుల రోధనలు మిన్నంటాయి. పోలీసులు వివరాలు సేకరించారు.

## అన్నపూర్ణకు కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, సెప్టెంబర్ 18: మండలంలోని అనంతగిరి శివారులోని అన్నపూర్ణ ప్రాజెక్టుకు గోదావరి జలాలను తరలిస్తున్నారు. బుధవారం బహుబలి మోటార్ల ద్వారా 6,440 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసినట్లు ప్రాజెక్టు ఏఈ సమరసేన తెలిపారు. శ్రీ రాజరాజేశ్వర జలాశయం (మధ్య మానేరు) నుంచి గ్రావిటి కెనాల్ ద్వారా తిప్పాపూర్ పంప్‌హౌస్‌లోకి గోదావరి జలాలు రాగా, బహుబలి మోటార్ల ద్వారా అన్నపూర్ణలోకి ఎత్తిపోస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 3.09టీఎంసీలు నిల్వ ఉండగా, సిద్దిపేట జిల్లాలోని రంగనాయకసాగర్‌కు గ్రావిటీ కెనాల్ ద్వారా 6,600క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.


అన్నపూర్ణ ప్రాజెక్టులోకి జలాలను ఎత్తిపోస్తున్న బహుబలి మోటర్లు




















